## కథ

# వారసత్వం

**టి.పి. హేమమాలిని**

“చిన్నప్పుడు నేనేమో అన్నింటికీ మారాం చెయ్యడమే. అన్నం తిననని, నీళ్లు పోసుకోనని.. ఒకటేమిటి? మా అమ్మ కొట్టబోతే మా నాన్నమ్మ అడ్డుకుని సర్ది చెప్పేది. తన ఒళ్లో కూచోబెట్టుకుని బువ్వ తినిపించేది. చారుబువ్వ కలిపినప్పుడు దాన్నిండా పోపుగింజలు కనిపిస్తే తిననని పేచీ పెట్టేవాడిని. అప్పుడు మా నాయనమ్మ చూడరా నాన్నా! ఈ పచ్చటి బువ్వ అంతా నీ పంటపొలం అన్నమాట. నీ పొలంలోకి చూడు మేకలు ఎలా వచ్చేశాయో! అంటూ ఆ పోపుగింజల్ని మేకలుగానూ, తను వాటిని తురుముతున్నట్లు చెప్పి ఓపిగ్గా వాటిని తీసిపారేసేది” శరత్ తన బాల్యపు బంగారు పుటలని ఒక్కోటి తిరగేస్తున్నాడు.

నా కూతురు ఐశ్వర్య వాళ్ల నాన్న మెడ చుట్టూ చేతులు వేసి ఊగుతూ వింటోంది.

భావుకుడు పచ్చటి కొండల మధ్య నారింజ రంగులు వెదజల్లే సూర్యాస్తమయాన్ని చూసి పరవశించినట్లు నేనా సుందర దృశ్యాన్ని కంటి కెమెరాతో తీసి, మనసు డార్క్ రూమ్‌లో నిక్షిప్తపరిచాను ఎప్పుడు కావలిస్తే అప్పుడు డెవలప్ చేసి చూసుకోవడానికి.

శరత్ మాటలు కర్ణపేయంగా ఉన్నాయి.

“నాన్నా! నువ్వు పెరుగన్నం తినకపోతే మీ నాయనమ్మ ఏం చేసేదో చెప్పవా?” అదేదో బాలకృష్ణుడి భాగవతగాథలా మళ్లీమళ్లీ చెప్పించుకుంటాడు నా సుపుత్రుడు సాకేత్.

“మా ఇంట్లో ఆవు ఉండేదిరా! ఇంట్లో పాడి పుష్కలంగా ఉండి కూడా నేను పాలు తాగడానికి, పెరుగు తినడానికి చాలా అల్లరి చేసేవాడిని. పెరుగంటేనే డోకొచ్చేది. మా నాన్నమ్మ వెండి పళ్లెంలో పెరుగన్నం కలిపి దానిలో కొంచెం ఆవకాయ కలిపి రంగు మార్చి ‘రెడ్‌రైస్’ అని నాకర్థమయ్యేట్లు పేరు పెట్టి తినిపించేది” పరవశంగా గుర్తు చేసుకుంటున్నాడు శరత్ తడి అయిన కళ్లతో.

నా కళ్లు కూడా ఆ తోవనే అనుసరించాయి. అందరి మధ్యా అపురూపంగా పెరిగిన బాల్యాన్ని గుర్తు చేసుకుని శరత్ ఆనందపరవశుడైతే ఏకాకిగా పెరిగిన నా బాల్యాన్ని గుర్తుచేసుకునే ప్రయత్నమే చేయను నేను. నాకు లేనిది నా పిల్లలకు అందివ్వాలని నా తపన.

“అప్పట్లో మా కుటుంబాలన్నింటిలోనూ మొట్టమొదట ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్లో చదివింది నేనే. మా తాతయ్యకి, నన్ను చూస్తే ఏ కలెక్టర్రో అన్నంత గర్వంగా ఉండేది. నేనిలా గొప్ప ఇంజనీర్‌ని అయినందుకు వాళ్లుంటే ఎంత పొంగిపోయే వారో!”

శరత్ జ్ఞాపకాలు కొనసాగుతూనే ఉన్నాయి.

* * *

చుట్టూ ఒక్కసారిగా సందడిగా అనిపించి ఈ లోకంలోకి వచ్చిపడ్డాను. పార్టీకి వచ్చిన అందరూ నవ్వుతూ, తుళ్లుతున్నారు.

సంప్రదాయం, ఆధునికతల కలబోతగా ఉంది ఆ ప్రదేశం, పార్టీకి హోస్ట్‌నైనా నాకా వాతావరణం సరిపడలేదు.

“ఏంటీ చీర? ఈ అవతారం?” ఎప్పుడొచ్చాడో, శరత్ పళ్లు బిగించి అడిగాడు ఎవరికీ వినబడకుండా.

హాఫ్ వైట్ బెంగాల్ కాటన్ శారీ, బ్లౌజ్, మెడలో సూత్రాల గొలుసు, నల్లపూసలు... ఇదే నా గెటప్.

“నా సహజ రూపం” నేనూ అలాగే చెప్పాను నెమ్మదిగా.

“కొత్త జ్యూయలరీ పెట్టుకోవచ్చుగా!”

“ఆస్తి వచ్చింది నీకు నాకు కాదు.”

“నీ, నా అనేంతగా దూరమైపోతున్నానన్నమాట.”

“సంతోషం! దూరం అనేది ఒకటుందని గుర్తించినందుకు.”

“నా ఖర్మ! అనుభవించే రాత ఉండాలిగా!” అంటూ వెళ్లిపోయాడు.

శరత్ నాన్నగారికి అంటే మామగారికి చెందిన స్థలం ఒకటి ఎన్నో ఏళ్లుగా వివాదంలో చిక్కుకుంది. అది ఈమధ్యనే బయటపడింది. ప్రస్తుతం ఉన్న రియల్ ఎస్టేట్ బూమ్ వలన దాదాపు కోటి రూపాయలు పలికింది. అప్పటికే అందరికీ సొంత ఇళ్లు ఉండి స్థిరపడడం వలన ఆయన చేతుల మీదుగా పిల్లలకి ఇవ్వాలన్న కోరికతో స్థలాన్ని అమ్మేశారు. ఆ డబ్బులో సగం శరత్‌కి ఇచ్చారు. మిగిలిన సగాన్ని నాలుగు వాటాలు చేసి రెండు భాగాలు ఆడపిల్లలిద్దరికీ ఇచ్చారు. ఒక వాటా తాముంచుకున్నారు. వారి తదనంతరం వృద్ధాశ్రమానికి రాసేశారు. మరో వాటాతో నాకు, కూతుళ్లకు నగలు చేయించారు.

నిజానికి సగటు ఆడదాన్ని చాలా సంతోషపెట్టే విషయం ఇదంతా! బీరువా నిండా చీరలు, లాకర్లు నిండా నగలు, డబ్బూ... ఇంతకంటే ఏం కావాలి?

కానీ నాకస్సలు ఆనందం కలుగలేదు. ఆస్తి చేరువవుతుందన్న వార్త తెలుస్తున్నకొద్దీ శరత్ దూరమైపోతున్నాడన్న భావన.

స్వతహాగా పుట్టిందో లేక అంచెలంచెలుగా ఎదిగిపోతున్న తన మిత్ర బృందాన్ని చూసో తెలియదుగానీ శరత్‌కి కూడా ‘ఎదిగి’పోవాలన్న కోరిక బలపడింది.

పేరున్న సంస్థలో ఇంజనీర్‌గా చేస్తున్న జాబ్‌కి రిజైన్ చేశాడు. వచ్చిన డబ్బుతో తనే ఒక కంపెనీ పెట్టాడు. దానికి డబ్బు చాలలేదు. అంతలోనే ఈ ఆస్తి కలిసిరావడం వలన అతని సంబరానికి అంతులేదు. అందరితో పరిచయాలు పెంచుకోవాలనే ఉద్దేశ్యంతో గ్రాండ్‌గా పార్టీ ఇస్తున్నాడు.

నిజానికి శరత్ ఉద్యోగంతో హాయిగా బతికేయవచ్చు. అది చాలంటాను నేను. ఎగువ మధ్యతరగతి స్థాయిలో ఉన్న నాకు సర్కిల్ పెరిగినా, డబ్బు పెరిగినా చికాకులే తప్ప మరే లాభం లేదని నా భావన.

నేనెరిగిన శరత్ ప్రేమానురాగాలు మూర్తీభవించిన శిల్పం.

నేటి శరత్‌ది డబ్బు లేకపోతే గుర్తింపు లేదన్న వ్యక్తిత్వం.


ఎంత కూడదనుకున్నా ఈ ఆలోచనలు నన్ను వదలిపోవడం లేదు.

“హాయ్ మిసెస్ శరత్! కంగ్రాచ్యులేషన్స్. మీరూ సంపన్నుల జాబితాలో చేరిపోయారు. ఇంకా ఈ అవతారమేంటి?” చెయ్యూపుతూ పలకరించింది మిసెస్ కృష్ణ.

“నాకిలాగే ఇష్టమండీ!” ఆమెని ఆహ్వానిస్తూ అన్నాను.

“పెద్ద గొప్ప! తనే సింపుల్‌గా ఉన్నట్లు ఫోజు” ఆధునికత డిజైనర్ శారీలోనే కానీ, వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుకోవడంలో కాదని తెలుపుతూ వినిపించిందో వ్యాఖ్యానం.

నాకు అనుకోని ఈ ఆస్తిని ఆహ్వానించాలని లేదు. అదే చెప్పాను శరత్‌కి. అయాచితంగా వచ్చినదానికి



ఆశించవద్దని.

"అది అయాచితమేమిటి? నా హక్కు" అంటూ కొట్టిపారేశాడు. అప్పటి నుండి పెరిగిన మనసు దూరాన్ని కొలిచే పరికరం లేదు.

నా శరీర స్పందనలు తెలిసినందువలన యాంత్రికంగా దగ్గరవ్వడం, అపరిచితుల్లా మెలగడం జరుగుతోంది.

పిల్లలకు కథలు, కబుర్లు లేవు. క్రమశిక్షణ పేరుతో పొద్దున్న ఏడు నుండి రాత్రి ఏడు వరకు ఉంచేసే ఓ కార్పొరేట్ స్కూల్లో జాయిన్ చేశాడు.

నా అభిప్రాయం అనవసరమనుకుని నేను చెప్పలేదు. మరిచాను. శరత్ అడగనూ లేదు.

"వెళ్లొస్తాం వందనా!"

"నైస్ హాస్పిటాలిటీ!"

"మీట్ ఎగైన్!"

ప్రశంసలు, వీడ్కోళ్ల మధ్య పార్టీ ముగిసింది.

"కేటరింగ్‌కి ఇవ్వద్దని నువ్వే చేశావు. ఐటమ్స్ అన్నీ చాలా బావున్నాయని అందరూ మెచ్చుకున్నారు. థాంక్యూ!"

"మన మధ్య థాంక్స్, సారీలు ఉండకూడదన్న రూలుంది"

పీకల్లోతు ఆకర్షణలో కూరుకుపోయినప్పుడు పెట్టుకున్న షరతు అది.

ప్రేమనే మరచిన మనిషికి షరతొకటి గుర్తుంటుందా!

తనకిష్టమైన పూరీ, కూర తినేసి బెడ్‌రూమ్‌లోకెళ్లిపోయాడు. పిల్లలు నిద్రపోయి చాలాసేపయింది. నేనూ పక్కమీదకి చేరాను.

శరత్ చెయ్యి నా మీద పడింది. అతని సంతోషాన్ని బాగా ఎంజాయ్ చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. హత్తుకోవడాలు, విడిపోవడాలు అన్నీ అసంకల్పిత ప్రతీకార చర్యలే.

శరత్ హాయిగా నిద్రపోయాడు. మేమున్నామంటూ ఆలోచనలు నా ఒడి చేరాయి. నాలో ఎన్నో జవాబు లేని ప్రశ్నలు!!

ఇదేనా సంసారం?

ఇదా దాంపత్యం?

ఇదేనా బాంధవ్యం?

అన్నింటినీ మించి ఇదా నేను కోరుకున్న ప్రేమ, పెళ్లి?

ఎక్కడైనా మగవాడు మగవాడేనా?

ప్రేమికుడు భర్త కాగానే ఎందుకు ఆధిపత్యపు జోరు కొనసాగిస్తాడు? భార్య మాటలకి ఎందుకని విలువివ్వడు? తగ్గిన ఆకర్షణే కారణమా?

* * *

మర్నాడు పిల్లలు వెళ్లిపోయాక పెద్దయుద్ధమే జరిగింది.

"వందనా! నీతో మాట్లాడాలి"

"చెప్పండి."

"అసలేంటి నీ ప్రాబ్లమ్"

మాట్లాడలేదు నేను.

"ఎందుకలా ఉంటావు? ఎందుకు ఎవరితోనూ కలవవు? సర్కిల్ పెంచుకుని స్పెండ్ చేయవచ్చు కదా!"

"నా సర్కిల్ నా కుటుంబమే కావాలన్న కోరిక"

"ఏం నేనేమైనా చచ్చానా?" అరిచాడు.

"నాకందుబాటులో లేరు!"

"అందరూ నీ అదృష్టాన్ని పొగుడుతున్నారు తెలుసా! కానీ నీకే... అనుభవించడం తెలీదు. ఎందుకలా ఒంటరిగా ఇంట్రావర్ట్‌లా బిహేవ్ చేస్తావు. నీకేం తక్కువ? మంచి చీరకట్టుకోవు. మంచి నగ పెట్టుకోవు. పార్టీలకి రావు.. అథవా వచ్చినా కలవవు"

"లేని అలవాట్లు చేసుకోలేను"

"అదేం చెడ్డ అలవాటు కాదే!"

"సరదా అలవాటుగా, అలవాటు అవసరంగా మారకూడదు. అనుకోకుండా వచ్చిన సంపద కరిమింగిన వెలగపండైతే?"

"ఆహా! ఏం ఆడదానివి? ఆస్తిపోతుందని, పోవాలని అనుకుంటున్నావా?" వ్యంగ్యంగా అడిగాడు.

"శరత్! నా భర్త కష్టార్జితంతో నాకు చేయించిన గొలుసు నాకు చాలు. అది వేసుకుంటే నాకదో ఆనందం కలుగుతుంది."

"ఇదేమీ అక్రమార్జన కాదు! నా తండ్రి నుండి వారసత్వంగా నాకు సంక్రమించింది" గట్టిగా అన్నాడు.

"వారసత్వంగా సంక్రమించింది కేవలం ఆస్తి మాత్రమేనా?" సూటిగా అడిగాను.

వాళ్ల నాన్నగారు శరత్‌కి యాభై లక్షలిస్తే దానిని రెట్టింపు చేసి తన కొడుక్కి ఇస్తాడు. తరాల మధ్య బదిలీ కావలసినది కేవలం ఆస్తిపాస్తులేనా?

"వందనా! నేను తెలివితక్కువగా చేసిన పనుల వలన నువ్వు చాలా రోజులు పసుపుతాడుతో తిరిగావు. లోకులంతా నిన్ను గేలిచేస్తుంటే నాకెలాగో ఉండేది. నీకు ఎన్నో నగలు చేయించి మురిసిపోవాలన్న కోరిక ఇలా తీరింది. కానీ నువ్వే... నన్నర్థం చేసుకోలేదు."

నన్ను పెళ్లి చేసుకున్న రెండేళ్లకే ఎలా అలవాటయిందో తెలియదు కానీ శరత్ తాగుడికి బానిసయ్యాడు.

తాగుడు వలన ఉద్యోగానికి గైర్హాజరు. దాని ఫలితం జీతం నష్టం. ఆ పరిస్థితుల్లో నాకున్న వస్తువులు తాకట్టు, అమ్మేయవలసి వచ్చింది. నేను త్వరగానే మేల్కొని శరత్ మిత్రుల సహాయంతో డీ ఎడిక్షన్ సెంటర్‌కి తీసుకు వెళ్లి ట్రీట్‌మెంట్ చేయించుకున్నాను.

ఆ ఏడాది కాలం అత్యంత భయంకరమైన సమయం నా జీవితంలో.

శరత్ బీరువా తీసి జ్యూయలరీ బాక్సులు తెచ్చాడు. అవి తెరచి నా ముందు పెట్టి "చూడు ఎంత ఖరీదైన నగలో!" అన్నాడు.

నిజమే! ముత్యాలు, పగడాలతో కూర్చిన పొడుగాటి హారం, కెంపులు, పచ్చలతో చేసిన నెక్లెస్, మ్యాచింగ్ ఇయర్ రింగ్స్ కళ్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

"మా నాయనమ్మ మా అమ్మకి ఎన్నో నగలు పెట్టింది. అవి అమ్మ కోడలికి ఇవ్వమని చెప్పింది. కానీ నాన్నగారి ఉద్యోగం చిన్నది కావడం వలన, బాధ్యతలన్నీ ఆయన తలకెత్తుకోవడం వలన ఆ నగలు అన్నీ హరించుకుపోయాయి. అమ్మ తన అత్తగారు తనకిచ్చిన లాంటివే తన కోడలికి ఇవ్వాలనుకుంది. అందుకే ఓల్డ్ మోడలైనా అటువంటివే చేయించింది. అంతేకాదు కూతుళ్లకి ఇంత కోడలికి ఇంత అని లిమిట్స్ పెట్టుకోలేదు. ముగ్గురికీ సమానంగా పంచింది. మా నాయనమ్మ మా అత్తలకిచ్చినట్లే! ఇవే దాచి నీ కోడలికివ్వాలి. అసలు...అసలు... నువ్వు జన్మలో వాటిని కళ్లతోనైనా చూడగలవా!" శరత్ చాలా మాట్లాడాడు.

నవ్వొచ్చింది నాకు. నిజమే! నేను పేద దాన్ని. డబ్బుకే కాదు బంధుత్వానికి కూడా. తల్లిదండ్రులు చిన్నప్పుడే పోతే, ఎక్కడో వేలువిడిచిన మేనమామ ఇంట్లో ఉండి పనిపాటలు చేస్తూ చదువుకున్నాను. నాకు స్కాలర్‌షిప్ రావడం వలన చదువుకి ఆటంకం రాలేదు. నా వ్యక్తిత్వమే ఆస్తి అనుకుని దాని అభివృద్ధికై కృషి చేశాను.


ఒకప్పుడు వ్యక్తిత్వానికి ముగ్ధుడైన శరత్ ఈ రోజు పేదరికాన్ని గుర్తు చేసినందుకు నవ్వొచ్చింది.

మా పెళ్లి శరత్ పెద్దవాళ్లకు మనస్ఫూర్తిగా ఇష్టం లేదు. కానీ కొడుకు కోసం నన్ను పొమ్మనలేదు.

నేను రాగానే మామగారు రిటైరయ్యారు. వెంటనే వాళ్లు స్వగ్రామం వెళ్లిపోయారు.

## మంచి పిల్ల ఇలియానా

తీరలు ఖాళీ సమయాల్లో ఏం చేస్తుంటారు అంటే, సినిమాలు టీవీ చూడ్డం లేదా ఎంచక్కా హాయిగా నిద్రపోవడం అని చాలావరకు జవాబు వస్తుంటుంది. కానీ ఇలియానా అలా కాదుట. ఆమెకి షూటింగ్ లేనప్పుడు ఇల్లంతా చక్కగా అలంకరించడం అలవాటుట. ఎక్కడి వస్తువులు అక్కడ నీట్‌గా పెట్టి, చిందరవందరగా వుండే గదులన్నీ సర్దడం చేస్తుంటానంటుంది. అంతే కాదు, తన చెల్లి, తమ్ముడికి చదువులో ఏవైనా సందేహాలుంటే వాటిని తీర్చడం కూడా తన ఖాళీ సమయంలో భాగమేనట. 'నేను ఎంత స్టార్‌నైతే మాత్రం నేనూ సాధారణ యువతినే కదా. కుటుంబంలో ఓ సభ్యురాలిలా మెలుగుతాను' అంటుంది ఇలియానా.



అత్త, మామ, ఆడబడుచు.. బంధాల కోసం ఎదురుచూసిన నాకు ఆదిలోనే నిరాశ.


ఎప్పుడూ కొడుకింటికి రాదు. ఇద్దరు కూతుళ్లకు ఎవరికే అవసరమొస్తే వారింటికి వెళ్లి వాళ్ల యోగక్షేమాలు చూడడం, కూతుళ్లు సెలవులకి వస్తే వాళ్ల సరదాలు తీర్చడం... ఇదే వాళ్ల పని.

"చెల్లెళ్లొచ్చినప్పుడు మీరంతా రండి!" అని ఓసారి శరత్‌తో అనేస్తారు. శరత్‌కి వీలు దొరకదు. నన్ను, పిల్లల్ని వెళ్లమంటాడు. నాకిష్టం ఉండదు. వెళ్లినా నేను, నా పిల్లలు ఒంటరి పక్షుల్లా అయిపోతాం. నా ఇంటికి వచ్చి నా చేత పని చేయించుకుని, ఓ పిడికెడు తిననప్పుడు నేను మాత్రం ఎందుకు వెళ్లి అక్కడ తినాలనిపిస్తుంది.

"నా కోడలికి చాలా ఇస్తాను శరత్! అయితే నగలు కాదు. నేను నా అత్త నుండి ఆశించి, పొందని ప్రేమని వారసత్వంగా ఇస్తాను. నా కోడలు తన కోడలికి చెప్పుకునేంత గొప్పగా ప్రేమిస్తాను. మీ నాయనమ్మ మీ అమ్మని ఎంత

ప్రేమగా చూసుకునేదో నువ్వు చెప్తేనే తెలిసింది. కోడలు కులాన్ని నిలిపేదని కన్నకూతుళ్లు అంటే మీ అత్తయ్యల కంటే ఎక్కువగా మీ అమ్మనే ప్రేమించేదట. మీ అమ్మకు, నాకు ఒకటే సారూప్యం, మా ఇద్దరికీ తల్లిదండ్రులు లేకపోవడం. కానీ అత్తింటికి వచ్చిన ఆమెకు అత్తమామలు తల్లిదండ్రులయ్యారు. అదే స్థితిలో మీ ఇంటికొచ్చిన నా పరిస్థితేంటి? మీ భార్యగా రానిచ్చారే కానీ నా బాగోగులేం చూశారు? ఆ పరిస్థితిలో వాళ్లు వద్దన్నా మీరు నన్ను పెళ్లిచేసుకు తీరతారని, వాళ్లు వద్దనకుండా పెద్దరికాన్ని నిలబెట్టుకున్నారు. మీ నాయనమ్మ నుండి ఆమె పొందిన ప్రేమని నాకు పంచారా మీ అమ్మ? అందరూ మీ నాయనమ్మలా చూస్తే అత్తాకోడళ్లంతా తల్లీకూతుళ్లైపోతారు. నేను ప్రేమను ఆశించి నిన్ను ప్రేమించి పెళ్లాడేను. అత్తమామలు అమ్మానాన్నలవుతారని, ఆడపడుచులు అక్కచెల్లెళ్లవుతారని కలలు కన్నాను. నేనూ రాగానే ఎవరి హోళ్లకు వారు చేరుకున్నారు. నా అంతట నేనుగా వెళ్లినా అంతంత మాత్రమే ఆదరణ! అన్నింటి కంటే నువ్వు...నువ్వు... ఎన్నో ఆశలు రేపిన ప్రేమమూర్తివి. నువ్వు కూడా వారి డబ్బునే ఆశిస్తున్నావు తప్ప వారి నుండి వై డోంట్ యూ ఎక్స్‌పెక్ట్ లవ్ ఎండ్ కేర్ ఫ్రమ్ దెమ్? వారసత్వం! వంశాచారం! ఎందులోనండీ వారసత్వం? పూర్వం డజన్లకొద్దీ పిల్లలని కనే వాళ్లు. లాంఛనానికి మొదటి కాన్పుకి పుట్టింటికి పంపినా మిగిలిన పురుళ్లన్నీ అత్తింట్లోనే జరిగేవి. కోడలు పునర్జన్మ నెత్తి వంశాభివృద్ధి చేస్తుందని ఎంతో అభిమానపడేవారు. మీ అమ్మగారికి ఎవరూ లేకపోవడం వలన మీరంతా మీ నాయనమ్మ చేతుల మీదుగానే పుట్టి పెరిగారు. మరి మీ అమ్మగారు పొందిన బాధ్యత అనే వారసత్వం నాకేదీ? నన్ను పెంచిన వాళ్లు పట్టించుకోలేదు పెళ్లయ్యాక.

మన పిల్లలిద్దరూ నర్సు పర్యవేక్షణలోనే పుట్టారు. పురుటినొప్పులు పడుతుంటే లాలనగా నా చెంపలు తడిమి ధైర్యం చెప్పే మనిషి నాకు కావాలనిపించింది.




చంటిపిల్లలకి నీళ్లు పొయ్యడానికి అవస్థ పడి, చుట్టపు చూపుగా వచ్చిన మీ అమ్మగారిని నీళ్లు పొయ్యమంటే తనకు మోకాళ్లు నొప్పులన్నారు. మరో మూడేళ్లకి పుట్టిన మీ చెల్లికూతురికి సర్వం తనే చేశారు. కూతుళ్లతో సమానంగా కోడలిని చూడద్దు. కనీసం కోడలికెవరూ లేరు. అన్నీ నేనే కావాలి అని అనుకోలేదు. ఆ భావనే ఎంతో ఆనందాన్నిస్తుంది. బాధ్యతగా నడిపిస్తుంది" నా ధోరణి వరద ప్రవాహానికి గేట్లు ఎత్తేసిన రిజర్వాయర్‌లా పరవళ్లు తొక్కుతూ సాగిపోతోంది.

"శరత్! నీ వ్యక్తిత్వానికి నైతికవిలువలకు ముగ్ధనై నీతో వచ్చేశాను. నువ్వు అలా ప్రవర్తించావంటే నీ పెంపకం ఎంతో ఉన్నతమైనదిగా భావించాను. కానీ వంశానుక్రమంగా ప్రేమకి బదులు డబ్బునిచ్చే వారసత్వాన్ని మూటగట్టుకుంటాననుకోలేదు. నా దురదృష్టం" నా ఆవేదన అర్థం చేసుకుంటే అతను చాలా ఆర్తి ఉన్నవాడు.



"నీతో వాదించలేం వందనా! నిజం చెప్పనా నువ్వో పిచ్చిదానివి!" తేల్చి చెప్పేసి వెళ్లిపోయాడు శరత్.

సమాజంతో పాటు మనమూ మారాలన్నది శరత్ వాదన. అంటే పదిమంది ఏది కోరుకుంటే పదకొండోవాడుగా మనమూ అదే పంథాలో నడవడం. ఏం? చేస్తున్న పని మంచే అయినప్పుడు, మనం ఒంటరిగా అడుగువేసినా, రానురాను అవి పది అడుగులై, వందలై, వేలై మనని అనుసరించచ్చు కదా!

వెనుకటి తరాల వారి ఆశయాలకి, ఆదర్శాలకి వారసులు కావాలి, కానీ ఆస్తులకి కాదు.

పాత తరం ప్రేమానురాగాలు వారసత్వంగా రావాలి.

ఆకాశం నుండి రాలిన వాన చుక్క నేల మీద పడి వేడికి నీటి ఆవిరిగా మారి మేఘరూపం దాల్చి తిరిగి మళ్లీ వానచుక్కగా మారుతుంది. ఆ చక్రభ్రమణం మనుషులకీ వర్తించాలి. తరతరాలకీ ప్రేమ, అనుబంధం, ఆప్యాయత అందివ్వగలగాలి. తప్పు చేస్తే అనురాగపూరితమైన మందలింపు, అవసరమైన చోట భద్రత, ఎదిగేటప్పుడు శ్రద్ధ... అన్నీ వారసత్వం కావాలి.

"శరత్ మీ పిల్లల ముద్దు ముచ్చట్లు వారికి తెలుసా? తాతయ్య నాయనమ్మల గారాబం, అనురాగం వీళ్లకు తెలుసా? మీ నాయనమ్మ కబుర్లు ఇప్పటికీ చెప్పుకుంటున్నారే! మీ పిల్లలకి ఆవిడ కథ ఓ రామాయణమే! అటువంటిది మీ పిల్లలు వాళ్ల నాయనమ్మ గురించి వాళ్ల పిల్లలకి భారతంలో పిట్టకథల్లా చెప్పుకునే వారసత్వం కావాలి. లక్షల విలువ చేసే నగలు కాదు వారసత్వంగా కావల్సింది కోట్లు పోసినా కొనలేని విలువలు వారసత్వంగా కావాలి. అవి ఇప్పించగలవా?"

ఇవన్నీ శరత్‌ని నిలదీసినా ప్రయోజనం లేని, నన్ను వేధించి వెంటాడే నా భావనలు.

నిజమే! అప్పనంగా వచ్చిపడ్డ సంపదని అనుభవించకుండా, అసలు దొరకని వాటి కోసం ఆరాటపడడం పిచ్చితనమే శరత్ చెప్పినట్లు.

నా ముందు తరాలకు నేనివ్వాలనుకునే వారసత్వం అందని మ్రాని పళ్లకు అర్రులు చాచడం కాదు!

☆

## రూటు మారుస్తున్న ఊర్మిళ

పాత సినిమాలు కొత్తగా నిర్మాణం జరుపుకుంటున్న నేపథ్యంలో దాదాపు పాతికేళ్ల క్రితం వచ్చిన 'కర్జ్' కూడా పునర్నిర్మాణం కానుంది. ఇందులో సిమీ గరేవాల్ పాత్ర అందరికీ తెలుసు కదా! విలన్ తరహా పాత్ర. ఈ పాత్రని ఇప్పుడు ఊర్మిళ ధరించబోతోందిట. హీరోయిన్‌గా దాదాపు తెరమరుగైన ఊర్మిళ తన రూటు మారుస్తోందన్నమాట. ఈ సినిమాతో వాంప్ తరహా పాత్రలు ఊర్మిళకి వస్తాయేమో!